మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమే..

## శవానికే రక్షణ లేదు..

- జడ్చర్ల దవాఖానాలో శవాన్ని కుక్కలు పీక్కుతినడం అత్యంత దారుణం
- ఇదేనా ప్రజా పాలన
- దవాఖానాను సందర్శించిన మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా. సి లక్ష్మారెడ్డి



ఆసుపత్రిని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా. సి లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, మార్చి 3 ప్రభాతవార్త:** జడ్చర్ల ప్రభుత్వ దవాఖానాలో శవాన్ని కుక్కలు పిక్కు తినడం అత్యంత దారుణమైన ఘటనఅని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యం అని మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా.సిలక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ దవాఖానాలో సోమవారం మార్చరీలో ఉన్న శవాన్ని కుక్కలు పీకుతున్న ఘటనపై ఆయన స్పందించారు. జడ్చర్ల హాస్పిటల్‌లో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన నేపథ్యంలో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ, వంద పడకల ఆసుపత్రిని, నూతనంగా నిర్మించిన మార్చురీ బిల్డింగును మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి పరిశీలించారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణం.. ఘోరాతి ఘోరం అన్నారు. ప్రాంతీయ దవాఖానాలో మార్చురి గది నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర అవుతున్న ప్రభుత్వ వైఫల్యంకారణంగానే ప్రారంభానికి నోచుకోలేదన్నారు. మార్చురుని ప్రారంభిస్తే ఈ ఘటన జరిగేది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ పాత రోజులు తెస్తాం అన్న మాటను ఈరోజు నిజం చేసింది అన్నారు. రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ఎక్కడా కూడా ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన వైద్యంఅందక సరైన మందులు లేక నిరక్ష్యానికి గురవుతున్నాయని తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల దవాఖానాలో జనరేటర్ లేదు అని అన్న విషయాన్ని గుర్తు చేశారు. అవస్తవాలను మాట్లాడిన రేవంత్ రెడ్డి కి కౌంటర్ గా జనరేటర్ ఉన్నవిషయాన్ని తమ పార్టీ నాయకులు మరుసటి రోజునే దబాఖానాకు వెళ్లి చూపించి నిరూపించారని, ప్రస్తుతం ప్రజా పాలనలో మార్చురీలో ఫ్రీజరు, సెక్యూరిటీ కనీస సౌకర్యాలు కూడా లేవని, శవాన్ని కింద పడేయడంతో నేడు శవాలను కుక్కలు తినే దారుణ దుస్థితి ఏర్పడిందన్నారు. కొత్త హాస్పిటల్‌లో 2024 జూన్ లోనే మార్చురీ బిల్డింగ్ కంప్లీట్ అయినా వాడుకోలేదు.. హాస్పిటల్ వాళ్ళు తీసుకొని ఆరు నెలలు అవుతుందని, అధికారుల మీద తోసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. మార్చురీ ఎందుకు మార్చ లేదు...పాత దాంట్లో ఫ్రీజర్, స్ట్రెచర్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. పేదలంటే ఇంతటి నిరక్ష్యమ్లా అంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇన్చార్జిగా ఉన్న జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా జిల్లాల్లో ఎంత దారుణంగా ఉందోఅర్థం చేసుకోవాలన్నారు. జడ్చర్ల ఘటన గురించి అందరూ చెప్పుకుంటున్నారని, ప్రభుత్వ నిరక్ష్యం వల్ల జడ్చర్ల పేరు ఘనంగా మారుమోగుతోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటల్స్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, కొత్త దవాఖానలు నిర్మించామన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వసతులు కల్పించ మన్నారు. ఆయన వెంట నాయకులు కోడుగల్ యాదయ్య, పిట్టల మురళి, పాలాది రామ్మోహన్, ప్రనిల్ చందర్, వీరేష్, ఇమ్ము, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్ రెడ్డి, దేవా, బుక్క మహేష్, సతీష్, నాయకులు కరాటే శీను, పెద్ది వెంకటేష్, అంజిబాబు, కొండల్, అమీర్, సంతోష్ చారి, సూరి తదితరులు ఉన్నారు.

## నలుగురు సస్పెన్షన్

- సూపరింటెండెంట్ సహా మరో ముగ్గురు పై వేటు
- జడ్చర్ల ఆసుపత్రి ఘటనపై ప్రభుత్వం చర్యలు

**జడ్చర్ల, మార్చి3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీలో శవాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకున్నది. మార్చురిలో శవాన్ని కుక్కతింటున్న వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయింది. జడ్చర్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంఓ హరినాథ్, డ్యూటీ డాక్టర్ మనీషా, ఎంఎన్ఓ రవి ప్రకాష్‌లపై సస్పెన్షన్ వేటు వేసింది. వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ దవాఖానను సందర్శించారు. అతి త్వరలో జడ్చర్లలోని నూతన ప్రభుత్వ ప్రాంతీయ దవాఖానాలో మార్చరుని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారుల నిరక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని చెప్పారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఇలాకాలో ఇంత దారుణమా..

- ఇతర జిల్లాలో పరిస్థితి ఏంటి..
- జడ్చర్ల దవాఖానాలో శవాన్ని కుక్కలు పీక్కు తినడంపై తీవ్రంగా స్పందించిన ఎంపీ డీకే అరుణ



**మహబూబ్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతిదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన పై ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఉన్నచోటే పరిస్థితి ఇలా ఉంటే ఇతర జిల్లాల సంగతేంటని ప్రశ్నించారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఘటనతో వైద్య ఆరోగ్య శాఖపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమౌ తుందన్నారు. పేదల ఇండ్లను కూల్చడంపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ పేద ప్రజలకు వైద్యం అందించడంలో లేదన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

- ఎమ్మెల్యేకు హాలిడే స్పాట్‌గా జడ్చర్ల
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాల త్రిపుర సుందరి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాల త్రిపుర సుందరి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలుపై హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జిల్లాల కలెక్టర్లతో జరుగుతున్న సమావేశంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## షీ టీమ్స్‌తో భరోసా

- మహిళలు, బాలికలకు భద్రత
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి




**మహబూబ్‌నగర్, మార్చి3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులకు సంపూర్ణ భద్రత కల్పించేందుకు షీ టీమ్స్ బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలు, బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లు ఇతర రద్దీ ప్రదేశాలలో షీటీమ్స్ సిబ్బంది సివిల్ డ్రెస్‌లో నిత్యం నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి నెలలో జిల్లాలో మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 20 ఫిర్యాదులు అందగా, అందులో 4 కేసుల్లో కౌన్సిలింగ్ నిర్వహించగా, 14 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చర్యలు తీసుకున్నామని, 2 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 6 ఈపెట్టి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలోని 70 హాట్‌స్పాట్ ప్రాంతాలను సందర్శించి నిఘా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో షీ టీమ్స్ బృందాలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాయని ఎస్పీ గారు తెలిపారు. బాలికలు, విద్యార్థినులు తమపై ఎలాంటి వేధింపులు జరిగినాభయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేయబడిందని, మహిళలు మరియు బాలికల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఎవరైనా రోడ్డుపై అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, వేధింపులకు పాల్పడినా వెంటనే డయల్ 100 లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659365 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థినులు మహిళలు తమ విద్యపై దృష్టి సారించి భవిష్యత్తును నిర్మించుకోవాలని, ప్రతి ఒక్కరి రక్షణ కోసం షీ టీమ్స్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఎస్పీ తెలిపారు. విద్యా సంస్థల వద్ద మరియు రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ నిర్వ హిస్తున్నారని తెలిపారు. అదే విధంగా పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, బాల్య వివాహాల దుష్పరిణామాలు, సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియా వినియోగం, మానవ అక్రమ రవాణా, సెల్ఫ్ డిఫెన్స్, మహిళా బాలల రక్షణకు ఉన్న చట్టాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలు షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ డి.జానకీ సూచించారు.



జిల్లా ఎస్పీ జానకి

## పోక్సో కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష

**పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జాన్, పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ జానకీ**

**మహబూబ్‌నగర్ క్రైమ్, మార్చి 3 ప్రభాతవార్త:** మహబూబ్నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 సంవత్సరంలో నమోదైన ఒక కేసుకు మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తనకు పాల్పడిన నిందితుడు యెర్ర సురేష్ (వీరన్నపేట, మహబూబ్‌నగర్) పై మంగళవారం ప్రత్యేక సెషన్స్ కోర్టు (రేప్, పోక్సో కేసుల విచారణ కోర్టు), మహబూబ్‌నగర్ లో తీర్పు వెలువడింది. కేసు నమోదు అనంతరం పోలీసులు తక్షణ చర్యలు తీసుకుని సమగ్ర దర్యాప్తు నిర్వహించి, చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. విచారణ అనంతరం ప్రత్యేక సెషన్స్ న్యాయమూర్తి తమన్ రాజ రాజేశ్వరి నిందితుడిని దోషిగా తేల్చి, ఒక సంవత్సరం ..కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000/ జరిమానా విధించారు. ఈ కేసు దర్యాప్తును అప్పటి ఎస్ఐ ఎన్.రామకృష్ణ (ప్రస్తుతం సీసీఎస్ ఇన్స్పెక్టర్, హైదరాబాద్) సమర్థవంతంగా నిర్వహించగా, ప్రస్తుతం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య పర్యవేక్షణలో విచారణ కొనసాగింది. ప్రాసిక్యూషనన తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జాన్ సమర్థవంతమైన వాదనలు వినిపించి తీర్పు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా కోర్టు లైజన్ అధికారులుగా ఏఎస్ఐ బాలకృష్ణ, సిపిలు ఎం.డి. రహీమ్, కృష్ణ, శంకర్ నాయక్, నర్సింహా, సంతోష్ తదితరులు సాక్ష్యాధారాల సమర్పణ, సమన్ల అమలు ప్రక్రియను క్రమబద్ధంగా నిర్వహించారు. ఈ సందరన్బంగా జిల్లా ఎస్పీ డి. జానకి కేసును నిష్పక్షపాతంగా, వేగవంతంగా దర్యాప్తు చేసి న్యాయం సాధించడంలో కృషి చేసిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జాన్‌ని, దర్యాప్తు అధికారులను, పోలీసు సిబ్బందిని అభినందించారు. మైనర్ బాలికలపై జరిగే నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

## హోలీ పేరుతో ఆకతాయితనం

- డ్రైనేజీ నీరు చల్లి బస్సు ప్రయాణికులకు ఇబ్బందులకు గురిచేసిన వైనం



వివరాలు వెల్లడిస్తున్న డ్రైవర్, కండక్టర్లు

**నారాయణపేట, మార్చి 3 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా ఊట్కూర్ లో హోలీ పండుగ సందర్భంగా కొంతమంది యువకులు ఆకతాయితనానికి పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. రంగులతో సంతోషంగా జరుపుకోవాల్సిన పండుగను కొందరు శృతి మించి ప్రవర్తిస్తూ డ్రైనేజీ మురుగు నీటిని బస్సులో ఉన్న ప్రయాణికులపై చల్లి అల్లరి చేశారు. ఊట్కూర్ మండల కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది పేట నుంచి మక్తల్ మీదుగా గద్వాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఊరి లక్ష్మమ్మ దేవాలయం సమీపానికి రాగానే, కొందరు యువకులు డ్రైనేజీ నీటిని డబ్బాల్లో నింపి బస్సు ప్రవేశ ద్వారం వైపు విసిరారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు, డ్రైవర్ కార్తిక్, కండక్టర్ ఇమాన్యుల్‌పై మురుగు నీరు పడి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దుర్గంధభరితమైన నీరు కారణంగా అక్కడి వాతావరణం అసహనంగా మారింది ఈ ఘటనతో బస్సు దాదాపు గంటపాటు నిలిచిపోయింది అనంతరం డ్రైవర్, కండక్టర్ సమీపంలోని కుళాయి వద్ద దుస్తులు ఉతుక్కొని ప్రయాణాన్ని కొనసాగించారు ఈ సందర్భంగా కండక్టర్ ఇమాన్యుల్ తన ఆవేదన వ్యక్తం చేస్తూ, హోలీ పండుగను ఆనందంగా, రంగులతో జరుపుకోవాలని కానీ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించరాదని సూచించారు పండుగ సంబరాల్లో శాంతి, సామరస్యాలను పాటించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఘనంగా హోలీ వేడుకలు



హోలీ వేడుకల్లో చిన్నారులు

2

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తాం

- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్





ప్రజాపాలన, ప్రణాళిక కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

**గద్వాల మార్చి 3, ప్రభాతవార్త :** ప్రజల ముందుకు ప్రజాపాలన తో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జిల్లాలో పని చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తెలిపారు. జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తెలిపారు. అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖగా వ్యవహరిస్తుంద న్నారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ, ఏప్రిల్ 16న మండల స్థాయిలో కార్యక్రమం, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం, మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శాఖల వారీగా 10 వివిధ థీమ్ లతో 99 రోజుల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, 1. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ 2. ఆరోగ్యం 3. అరైవ్.. అలైవ్ 4. సంక్షేమం 5. పిల్లల భద్రత.. డ్రగ్స్‌కు అడ్డుకట్ట 6. రైతు సంక్షేమం..వ్యవసాయం 7. విద్య 8. యువత.. క్రీడలు 9. మహిళలు 10. పర్యావరణం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి, 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాను ఉన్నట్లు తెలియజేశారు.

### చంద్రగ్రహణం ఎఫెక్ట్..

## ఆలయం మూసివేత

**చిన్నచింతకుంట, మార్చి 3 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని గ్రేడ్ వన్ దేవాలయాల్లో ఒకటైన శ్రీ కురుమూర్తి ఆలయం మంగళవారం చంద్రగ్రహణం కారణంగా మూసివేశారు. ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకులు స్వామివారి ఆలయం మూసివేసి మరల బుధవారం తెల్లవారుజామున 5గంటలకు స్వామివారి గర్భాలయంలో సంప్రోక్షణ, అభిషేకం పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనానికి అవకాశం కల్పిస్తామని ఆలయ అర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, అనంత విజయ్ ఒక ప్రకటనలోతెలిపారు.



శ్రీకురుమూర్తి స్వామి ఆలయం మూసివేస్తున్న ఆలయ అర్చకులు

## మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ప్రవీణ్ యాదవ్ ఏకగ్రీవం



ప్రవీణ్ యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**బాలానగర్, మార్చి 3 ప్రభాతవార్త :** బాలానగర్ మండల ఉప సర్పంచుల సంఘం నూతన కమిటీని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఎన్నుకున్నారు. మండలంలోని ఉప సర్పంచులు ఏకగ్రీవంగా మోతిఘనపూర్ ఉపసర్పంచ్ ప్రవీణ్ యాదవ్ ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కేతావత్ జగన్ నాయక్, జ్యోతి నామ్య నాయక్, చందర్,మల్లేష్ యాదవ్‌లను, ప్రధాన కార్యదర్శులుగా మహేందర్, సత్యనారాయణ రెడ్డి, కోశాధికారిగా గీత శ్రీకాంత్ నాయక్, కార్యదర్శులుగా ఇస్లావత్ చందర్, కేతావత్ రవి తదితరులను ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం ఈ సంఘం కీలక పాత్ర పోషిస్తుందని ప్రవీణ్ యాదవ్ తెలిపారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శాలువాలతోసన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆయా గ్రామాల ఉప సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడు జింక రవిని సన్మానించిన మత్స్యకారులు



**అమరచింత మార్చి3, ప్రభతవార్త:** అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన జింక సువర్ణ భర్త కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జింక రవిని అమరచింత మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద చెరువు దగ్గర శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జింక రవి మాట్లాడుతూ, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో అమరచింత పెద్ద చెరువు అభివృద్ధి కోసం మూడు కోట్ల నిధులు మంజూరయ్యాయని అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. అమరచింత మత్స్య కార్మికులు పెద్ద చెరువులో చేపలపై ఆధారపడి జీవిస్తున్నారని మత్స్య కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అమరచింత మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు, రవికాంత్, ఉపాధ్యక్షులు రమేష్ ముదిరాజ్, కోశాధికారి తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి జలగరి శ్రీనివాసులు,సభ్యులు వెంకటన్న,టి రాఘవేంద్ర, జలగరి రామ్మూర్తి, కర్నే శ్రీనివాసులు, కోళ్ల ఆంజనేయులు, పెద్దనాగరాజు, గుండాల రాజు, చిన్న నాగరాజు, తెలుగు రమేష్, వెంకట్ రాములు, శ్రీనివాసులు, రాజేష్, అఖిల్, వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షుడిగా బాయికాటి బాల్ రెడ్డి ఎన్నిక



బాయికాటి బాల్ రెడ్డి

**మక్తల్ టౌన్, మార్చి3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా టెన్ని కైట్ అసోసి యేషన్, నూతన అధ్యక్షునిగా పిటి బాయికాటి బాల్ రెడ్డిని నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర టెన్నికైట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి. గోపాలం విలేకరుల సమావేశంలో తెలిపారు. నారాయణపేట జిల్లా టెన్నికాయిట్ అసోసి యేషన్ నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు పిఈటి బైకాటి బాల్‌రెడ్డి మాట్లా డుతూ నాపై నమ్మకంతో నన్ను నారాయణపేట జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలంకు,రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పిఎన్ వెంకటేష్‌కి బాయ్ కాటి బాల్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన మాట్లాడుతూ నేను నారాయణపేట జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడా ఆణిముత్యాలను వెలికి తీసి, వారికి క్రీడలలో మెరుగైన శిక్షణ ఇచ్చి రాష్ట్ర జాతీయస్థాయి టెన్నికాయిట్ క్రీడలకు పంపుతానని ఆయన తెలిపారు. నారాయణపేట జిల్లా టెన్ని కైట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బాల్ రెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం ,జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దీప, కోశాధికారి డి .రాము అభినందించారు.

## చేతిపంపుకు మరమ్మత్తు..కంపచెట్ల తొలగింపు

◆ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న అందరి సహకారంతో పరిష్కరిస్తా : సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి



బోరును మరమ్మతు చేయిస్తున్న, కంపచెట్లను తొలగిస్తున్న సర్పంచ్

**శ్రీరంగాపూర్, మార్చి3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని కంబలపురం గ్రామంలో ఎస్సీ కాలనీలోని చేతిపంపును గ్రామ సర్పంచ్ పర్వత్ రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి మరమ్మతులను చేయించి తాగునీటి సమస్యను లేకుండా చేయడం జరిగింది. గ్రామంలోని శివాలయానికి వెళ్లే దారిగుండా ఉండే కంపచెట్లను తొలగించి సీసీ రోడ్డు ఇరుపక్కలకు మట్టిని పోయించి శివాలయానికి వెళ్లే దారిని భక్తులకు వాహనదారులకు ఇబ్బంది లేకుండా సర్పంచ్ సమస్యను పరిష్కరించడం జరిగింది. కంబాల పురం గ్రామ ప్రజలు సర్పంచ్ విజయకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామంలో ఎలాంటి సమస్యలుఉన్న గ్రామ ప్రజల పెద్దల, యువకుల సహకారంతో పరిష్కరిస్తానని అందరి సహాయ సహకారాలు తనకు ఉండాలని తెలియజేయడం జరిగింది.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గోలి శ్రీనివాస్ రెడ్డి

**వెల్దండ, మార్చి 3 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని గానుగట్టు తాండ గ్రామపంచాయతీ పరిధిలోని వంటి గుడిసె తండాకు చెందిన గణేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మృతుని కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలు అండగా ఉంటానని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో నాగులునాయక్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, లచ్చిరామ్‌నాయక్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, ఆనంద్‌తో పాటు తదితరులున్నారు.



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

# ఘనంగా హోలీ వేడుకలు

### చిన్నారుల సందడితో హోలీ సంబరాలు

**దేవరకద్ర,మార్చి 3 ప్రభాతవార్త:** రంగుల పండుగగా ప్రసిద్ధి చెందిన హోలీ సందర్భంగా చిన్నారులు స్వయంగా సహజరంగులు తయారు చేసుకుని,ఆనంధోత్స వాలతో వేడుకలు జరుపుతున్నారు. పూలతో, కుంకుమతో, పసుపుతో, రంగులు సిద్ధం చేసుకుని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ హర్షతిరేఖాలతో ఆడిపాడారు. రంగుల పండుగగా ప్రసిద్ధి చెందిన హోలీ పండుగను కౌకుంట్ల మండల కేంద్రంలో చిన్నారులు ఘనంగా నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందోత్స వాలతో సంబరాలు చేసుకున్నారు. చిన్నారుల నవ్వులు కేరింతలతో వాతావరణం కళకళలాడింది. పెద్దలు కూడా వారితో కలిసి, పాల్గొని పండగ ఉత్స వాన్ని రెట్టింపు చేశారు. ప్రకృతి స్నేహపూర్వక రంగులతో జరుపుకున్న ఈ హోలీ పండుగ అందరికీ ప్రత్యేక అనుభూతిని అందించింది. కౌకుంట్ల, దేవరకద్ర, మండలాలతో పాటు వివిధ అన్ని గ్రామాలలోనియువకులు,చిన్నారులు, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.కౌకుంట్ల గల్లీలలో,వార్డులలో, కేకలు కొడుతూ సంతోషంగా హోలీ పండుగను జరుపుకున్నారు.

**నారాయణపేట, మార్చి 3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో హోలీవేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నా పెద్దా తారతమ్య భేదాలు లేకుండా ప్రజలు ఒకరిపై ఒకరు వివిధ రకాల రంగులు చల్లుకుంటూ ఆనందోత్సా హాల మధ్య పండుగను జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు తమ తమ కాలనీలలో డీజేలు ఏర్పాటు చేసుకుని ఉత్సా హంగా నృత్యాలు చేస్తూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు కూడా ఈ సంబరాల్లో పాల్గొని ప్రజలతో కలిసి రంగులు చల్లుకున్నారు. హోలీ వేడుకలలో భాగంగా మొదటి రోజు సోమవారం కామ దహనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఆయా గ్రామాల్లోని బొడ్రాయి, ప్రధాన చౌరస్తాల వద్ద కామ దహనం నిర్వహించి సంప్రదాయాలను పాటించారు.అలాగే పలువురు యువకులు ఇంటింటికి వెళ్లి రంగులు చల్లుతూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది సభ్యులు పరస్పరం రంగులు చల్లుకొని అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు .

**గద్వాల మార్చి 3, ప్రభాతవార్త:** హోలీ పండుగ సందర్భంగా చిన్నారులు రంగుల కేలి ఆడుతూ సంబురాలు చేనుకున్నారు. జిల్లా కేంద్రంలోని 3వ,వార్డు జి.వేణు కాలనీ లో గవర్నమెంట్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ దగ్గర ఘనంగా హోలీ సంబరాల నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులతో కలిసి రంగులు చల్లుకుంటూ, ఉట్టి కొడుతూ డీజే సాంగ్స్ తో నృత్యాలు చేస్తూ హోలీ వేడుకలుజరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో వెంకట నర్సమ్మ,రామలక్ష్మమ్మ, సబిత, అనసూయ, సువర్ణ,రాజేశ్వరి, బేబీ,శిరీష,శ్రావణి, సుజాత,స్వీటీ, ప్రియాంక, పల్లవి, హారిక, చిన్నారులు పవన్‌కుమార్, సాయి,అనూష్, రోషన్,హర్ష,మోక్షిత్, మేఘనశ్రీ, కుశాల్, కుట్టి, లక్కీ తదితరులు పాల్గొన్నారు.



ఉట్టి కొడుతూ హోలీ రంగులతో నిండిన చిన్నారులు



రంగులను సొంతంగా తయారు చేసుకుని హోలీ ఆడుతున్న చిన్నారులు

# ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

### ఎమ్మెల్యేకు హాలిడే స్పాట్‌గా జడ్చర్ల : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాల త్రిపుర సుందరి



జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాల త్రిపుర సుందరి

**జడ్చర్ల, మార్చి 3 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న ఘటన అత్యంత హేయమైనది అమానవీయమైనదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల త్రిపుర సుందరి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "చెరువులో పడి మరణించిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తే, అక్కడ కనీస వసతులు లేక, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆ శవాన్ని కుక్కలు పీక్కుతినడం ఈ రాష్ట్ర ప్రభుత్వ పాలనకు నిదర్శనం అన్నారు. మనిషి బ్రతికున్నప్పుడు వైద్యం అందించలేని ఈప్రభుత్వం,కనీసం చనిపోయిన తర్వాత ఇచ్చే గౌరవాన్ని కూడా కాలరాస్తోందన్నారు. హాలిడే స్పాట్ ఎమ్మెల్యే.. స్థానిక ఎమ్మెల్యేకు జడ్చర్ల నియోజకవర్గం ఒక హాలిడే స్పాట్‌లా మారిందని తీవ్రంగా విమర్శించారు. ఆయన అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడంతప్ప, నియోజకవర్గ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని, ఆరోపించారు. ఆసుపత్రి నిర్వహణపై కనీస పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈరోజు మృతదేహాలకు ఈ గతి పట్టిందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈ మహబూబ్‌నగర్ జిల్లాకు ఇన్చార్జ్ మంత్రిగా ఉన్నారని,జిల్లాలోనే ఆసుపత్రులు కుక్కల నిలయాలుగా మారుతుంటే, రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుల ఆరోగ్య పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. జడ్చర్లకు100 పడకల ఆసుపత్రి ప్రారంభం అయి మూడేళ్లు గడిచినా నేటికీ అతీగతీ లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓట్ల కోసం హడావిడిగా ప్రారంభోత్సవం చేస్తే, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులను పూర్తిగా అటకెక్కించింది. నిధులు ఏమవుతున్నాయన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే భారీ నష్టపరిహారం చెల్లించాలని, ఎమ్మెల్యే వెంటనే ఆసుపత్రి కమిటీని సమావేశపరిచి, మౌలిక సదుపాయాలు సిబ్బంది కొరతపై చర్యలు చేపట్టాలని 100 పడకల ఆసుపత్రిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట బిజెపి పట్టణ అధ్యక్షుడు ఎడ్ల అమర్నాథ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి తదితరులు ఉన్నారు.

# నిందితులను శిక్షించాలి

● టూ టౌన్ పోలీస్ స్టేషన్ ముట్టడించిన హిందూ సంఘాలు

● నాకు ప్రాణహాని ఉంది : బాధితుడు సంతోష్



టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ టౌన్, మార్చి3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 43వ డివిజన్ న్యూ ప్రేమ్‌నగర్‌కు చెందిన యువకుడు సంతోష్‌పై ఓ వర్గానికి చెందిన కొంతమంది మూకుమ్మడి దాడి చేయడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిదా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.ఆదివారం రాత్రి సంతోష్‌ను మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖాన వద్ద పట్టుకుని ముకుమ్మడిగాదాడి చేశారు.ఎంత వేడుకున్నా వినలేదు. చుట్టుపక్కల వాళ్ళు గమనించి పోలీస్టేషన్‌కు సమాచారం అందించి దగ్గరికి వెళ్లడంతో వెంటనే యువకులు పరారయ్యారు. బాధితుడు కోలుకొని పోలీస్ స్టేషన్లో ఈమెరకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు పెద్ద ఎత్తున మహబూబ్నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషనుకు మంగళవారం చేరుకున్నాయి. సంతోష్ పై దాడి చేసిన వారిని వదిలి పెట్టొద్దని, శిక్ష పడేలాచూడాలని డిమాండ్ చేశారు. చట్టం న్యాయం అందరికీ సమానమని,ఒక వర్గానికి మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటే తదుపరి చర్యలకు పోలీసులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆందోళనలో కార్పొరేటర్లు పాండురంగారెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, నాయకులు మెట్టుకాడి శ్రీనివాస్, మైత్రి యాదయ్యతో పాటు హిందూ సంఘాలు, బిజెపి నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**చుట్టుపక్కల వారు రాకుంటే ప్రాణం పోతుండే : బాధితుడు సంతోష్**

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమీనే అంతం కావడంపై నేను సోషల్ మీడియాలో ఒక స్టోరీ పెట్టానని మా గల్లీకి చెందిన ఓ ముస్లిం యువకుడు ఇదే విషయాన్ని వాళ్ళ గ్రూపులో పెట్టి అందరిని రెచ్చగొట్టేలా చేసి నా మీదకి మూకుమ్మడిగా దాడి చేశారని బాధితుడు సంతోష్ మీడియాకు తెలిపారు. " గత రెండు రోజులుగా మా షాప్ చుట్టూ రెక్కీ కూడా నిర్వహించారని చుట్టుపక్కల వాళ్ళు నాకు సమాచారం అందించారు. ఆదివారం రాత్రి 15 20మంది యువకులు కలిసి ఒక్కసారిగా నాపై దాడి చేశారు. ఆ సమయంలో చుట్టుపక్కల వాళ్ళు గమనించి సమాచారం పోలీసులకు కూడా చేరవేసి నా దగ్గరకు రావడంతో నాకు ప్రాణాపాయం తప్పింది.నాకు ప్రాణహాని ఉంది. నేను ఎవరి జోలికి వెళ్ళను. నాకు రక్షణ కల్పించండి" అంటూ మీడియా ముందు తన ఆవేదన వ్యక్తం చేసాడు.

# జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డితో రాహుల్ గాంధీ




రాహుల్ గాంధీతో డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి

**నారాయణ పేట, మార్చి 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డికి సూచించారు వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక ప్రాంతంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులతో నిర్వహించిన"సంఘటన సృజన్ అభియాన్" శిక్షణ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు హాజరయ్యారు ఈ శిక్షణ కార్యక్రమంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాల ప్రచారం, కేడర్ శక్తివంతీకరణ వంటి అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసి పార్టీని మరింత పటిష్టం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు అలాగే ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కొంతసేపు ముచ్చటించి ఆత్మీయంగా పరామర్శించారు.

# ప్రాక్టీస్ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించిన కౌన్సిలర్



పాక్టీస్ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించిన వార్డ్ కౌన్సిలర్ అల్కూరి పావని

**మక్తల్ టౌన్ ,మార్చి 3 ప్రభాతవార్త:** మక్తల్ మినీ స్టేడియంలో మంగళవారం రోజు అండర్ 14 విభాగంలో మరికల్, కంట్రీ క్లబ్ జట్ల మధ్య ప్రాక్టీస్ మ్యాచ్ స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరు జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకొని, వారికి ఆల్ ది బెస్ట్ తెలిపారు. వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక మానసిక ఆరోగ్యాన్ని అందివ్వడమే కాకుండా... మనుషుల మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తాయనిఅన్నారు. చిన్నారులను క్రమం తప్పకుండా క్రీడల్లో రాణించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. క్రీడా శాఖ మంత్రి అయిన వాకిటి శ్రీహరి గారు, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నూతన క్రీడా పాలసీ తీసుకొచ్చారని, ఇందులో భాగంగా క్రీడలకు పెద్దపీట వేశారని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతం నుంచి ఒలింపిక్స్ లాంటి అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు చేరుకునేలా క్రీడాకారులను తయారు చేయడమే నూతన క్రీడా పాలసీ ఉద్దేశమని తెలిపారు. స్పోర్ట్స్ రిజర్వేషన్లను సైతం రాష్ట్ర ప్రభుత్వం పెంచే ఆలోచనలో ఉందని తెలిపారు. దాదాపు 25 కోర్లూపాయలతో మక్తల్ మినీ స్టేడియాన్ని మంత్రి వాకిటి శ్రీహరి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబోతున్నారని,అతి త్వరలో మక్తల్ మిని స్టేడియం రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు అల్కూరి రవికుమార్, కోచ్ వల్లి ఉద్దీన్, నర్సింగ్, యాదవ రాజ్, భాస్కర్ గౌడ్, అన్నం పల్లి రమేష్, కడే చూర్ రాజేష్ కుమార్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్చాల గ్రామ ఉప సర్పంచ్ నిజామొద్దిన్ కుటుంబానికి పరామర్శ



నిజామొద్దిన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఠాకూర్ బాలాజీసింగ్

**కల్వకుర్తి, మార్చి 3 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ నిజామొద్దిన్ తండ్రి చాంద్‌పాష సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీసింగ్ మంగళవారం మార్చాల గ్రామానికి వచ్చి ఉప సర్పంచ్ నిజామొద్దిన్ కుటుంబాన్ని పరామర్శించి మృతదేహనికి నివాళులర్పించారు. మనోధైర్యంగా ఉండాలని ఉప సర్పంచ్‌కు సూచించారు. పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేష్, గ్రామస్తులు సుధాకర్‌రెడ్డి,మార్చాల శ్రీనివాసులు,గౌస్, శ్రీకాంత్, విశ్వేశ్వర్‌తో పాటు పలువురు సభ్యులు ఉన్నారు.

## వార్డు కౌన్సిలర్లకు ఘన సన్మానం



సన్మానం పొందిన ఎస్సి సామజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లు

**గద్వాల మార్చి 3,ప్రభాతవార్త:** గద్వాల్ మున్సిపాలిటీ ఎన్నికలలో వార్డు కౌన్సిలర్లుగా బాధ్యతలు స్వీకరించిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్స్ అందరికీ గంజిపేట తిమ్మన్న ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు.బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. సన్మానం పొందిన వారిలో 14వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ గంజిపేట శంకర్, 1వ వార్డు వెంకపంపేట కౌన్సిలర్ చిన్న రాములు,4వ వార్డు కౌన్సిలర్ జమ్మిచేడు లలితమ్మ, 5వ వార్డు కౌన్సిలర్ జమ్మిచేడు చిన్న చంటెన్న లు వున్నారు. ఈ కార్యక్రమంలో కోర్ట్ రాజు, డి ఏ ఓ రాజు, రమేష్ కుమార్ టీచర్, రాము,ప్రవీణ్, భీమన్న, దినేష్,బైని పరుశురాం, ఎంఆర్‌పిఎస్ పరుశురాం, వంశీ,వినోద్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థి ఘనత - రాష్ట్రస్థాయిలో ధన్వాడకు కీర్తి



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

**ధన్వాడ, మార్చి3 ప్రభాతవార్త:** సమగ్ర శిక్షా తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దోమలగూడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో ధన్వాడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఆంజనేయులు అద్భుత ప్రతిభ కనబరిచారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఆయన సత్తా చాటారు.పోటీలలో ఆంజనేయులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతోపాల్గొని ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు రాకేశ్‌శెట్టి మరియు ఉపాధ్యాయ బృందం ఆంజనేయులును అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటగలరని ఆంజనేయులు నిరూపించారని వారు తెలిపారు. ధన్వాడ మండలంలో ఆయన విజయం ఆనంద వాతావరణాన్ని సృష్టించింది.

## వైభవంగా రథోత్సవం

**బిజినేపల్లి, మార్చి 3 ప్రభాతవార్త:** మండలంలోని వట్టెం స్వయంభూ నారదగిరి శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్స వాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్స వం వైభవంగా సాగింది.కార్యక్రమంలో దేవాలయ అర్చకులు ధర్మకర్తలు, అభ్యుదయహిందూ సేవసమితి సభ్యులు, గ్రామ సర్పంచ్, పెద్దలు,గ్రామప్రజలు,చుట్టుపక్కలగ్రామలప్రజలుపెద్దమొత్తంలో పాల్గొన్నారు.



# త్యాగధనుడు మా లక్ష్మన్న..

◆ మళ్లీ దశలో తొలి రాజీనామా చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనం
◆ మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల, మార్చి 3 ప్రభాతవార్త:** "మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజుల్లో, స్వరాష్ట్ర ఆకాంక్ష ఏకైక లక్ష్యంగా వందలాది విద్యార్థుల బలిదానాల ముందు తన ఎమ్మెల్యే పదవిని గడ్డి పోచల భావించి రాష్ట్రంలోనే తొలి రాజీనామా సమర్పించి ఉద్యమానికి ఊపిరి పోసిన లక్ష్మారెడ్డి త్యాగధనుడు" అంటూ బిఆర్ఎస్ జడ్చర్ల నియోజకవర్గ నాయకులు కొనియాడారు. జడ్చర్ల సిగ్నల్ కట్ మాజీ సీఎం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మలిదశ ఉద్యమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం 2008లో కేసీఆర్ ఆదేశం మేరకు తన ఎమ్మెల్యే పదవికి గడ్డి పోచలా భావించి మొదట రాజీనామ చేసిన సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. 2009 సాధారణ ఎన్నికల్లో మిత్ర పక్షంలో టీడీపీకి జడ్చర్ల ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో ఎర్రశేఖర్ విజయం కోసం కృషి చేశారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ మహబూబ్ నగర్ నుండి పోటీ చేయగా ఎంపీగా గెలుపొందడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేస్తారు. కార్యక్రమంలో నాయకులు కొడుగల్ యాదయ్య, పిట్టల మురళి, రఘుపతిరెడ్డి, ఇంతియాజ్ ఖాన్, ప్రణిల్ చందర్, రాంమోహన్, ప్రశాంత్‌రెడ్డి, బీకేఆర్, దేవా, కొండల్, సతీష్, మహేష్, శశికిరన్, నర్సింహ, వంగూర్‌నర్సింహ., హఫీజ్, పరమటయ్య ఉన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

**మక్తల్ టౌన్, మార్చి 3 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డులో ఆజాద్ నగర్ చౌరస్తా సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీతో ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించి, మంగ ళవారం మున్సిపాలిటీ సిబ్బందితో మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీ మరమ్మత్తు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కురి పావని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో ఇప్పటికే స్థానిక వార్డు పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలుచేపట్టామని, సిసిరోడ్లు డ్రైనేజీలు, మిషన్ భగీరథ పైప్లైన్ పనులు చేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో మరిన్ని నిధులు తీసుకు వచ్చి 16వ వార్డును మరింత అభివృద్ధి చేసేందుకు శాయ శక్తులా కృషి చేస్తానని అల్కురి పావని తెలిపారు. కాంగ్రెస్ టౌన్‌అధ్యక్షులు అల్కురి రవికుమార్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు కొలిమి హనుమంతు, రంజాన్ రాజా, ఆనంపల్లి రమేష్, కడే చూర్ రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**భూత్పూర్, మార్చి 3, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ మాడల్స్ ప్రదర్శనలు, వర్కింగ్ మోడల్స్, రకరకాల శాస్త్రీయ ప్రయోగాల ప్రదర్శనలు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. పండని పంటలు, సైన్స్ రంగోలి కార్యాక్రమాలతో విజ్ఞాన శాస్త్ర విభాగాలకు సంబంధించిన బొమ్మలు గీసి విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. విటమిన్ల ఆవశ్యకత, వాటి ఉపయోగాలపైన ఏడో తరగతి విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆరో తరగతి విద్యార్థిని విద్యార్థులు మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన స్వర్గీయ అబ్దుల్ కలాం జీవితంపై నృత్యాన్ని ప్రదర్శించారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా నాటక ప్రదర్శన నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బైకాని బాలు యాదవ్, పద్మజతో పాటు ఇతర ఉపాధ్యాయులు శారద, రమేష్, చెన్నయ్య, వెంకటేష్, లక్ష్మి, స్వరూప, శోభ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన సర్పంచ్ కావలి రామకృష్ణ

**రాజాపూర్, మార్చి3 ప్రభాతవార్త :** రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచుల సంఘం రాజాపూర్ మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి గ్రామ పంచాయతీల బలోపేతానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. అనంతరం ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కావలి రామకృష్ణతో పాటు రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన బుగ్గయ్య, రియాజ్, హనుమంతు తదితరులు ఉన్నారు.



## అందరికి అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలు

● ఏఎంసి ఛైర్మన్ రాంపురం శివారెడ్డి


ఎల్‌ఓసిని అందజేస్తున్న ఏఎంసి ఛైర్మన్ రాంపురం శివారెడ్డి

**నారాయణ పేట, మార్చి 3 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శేర్నపల్లి గ్రామానికి చెందిన ధారమోని అనిత భర్త శంకరప్పకి రూ.2 లక్షల ఎల్‌ఓసీను ఏఎంసి చైర్మన్ రాంపురం శివారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రాంపురం శివారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని కుటుంబాలకు ఎల్‌ఓసీల ద్వారా తక్షణ సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాము ఎల్లప్పుడూ ముందుంటామని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా బాధిత కుటుంబాలకు అవసరమైన పూర్తి మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేర్నపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

**ఆత్మకూర్ మార్చి 3 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఆరవ వార్డు ప్రజలు వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కో కుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లుగా ఆరో అవార్డు బిజెపి కౌన్సిలర్ పుల్లరి భరత్ ప్రభాత వార్తకు తెలిపారు. గత కొన్ని రోజులుగా నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఎల్లవేళలా నీటి సరఫరా గావించేందుకు మున్సిపల్ కమిషనర్ తో చర్చించి ముందు జాగ్రత్త చర్యగా కాలనీలోని ప్రతి ఇంటికి మంచినీరు అందించే విధంగా ముందు జాగ్రత్తగా పైప్ లైన్ నిర్మాణం చేపడుతున్నట్లుగా ఆయన తెలిపారు. గతంలో వేసవిలో నీటి ఎద్దడి నివారించేందుకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే విషయాన్ని ముందుగానే గుర్తించి అలా కాకుండా ప్రజలకు నిత్యం నల్లా నీటి ద్వారానే మంచిరెడ్డి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని అందులో భాగంగానే కాలనీలోని ప్రతి వీధిలో మంచినీటి పైప్లైన్ నిర్మాణం చేపట్టినట్లుగా ఆయన తెలిపారు.


ఆత్మకూరులోని ఆరవ వార్డులో పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ భరత్

# అలరించిన ఉమ్మడి జిల్లా కోలాటం పోటీలు


మామిళ్ళపల్లిలో ఉమ్మడి జిల్లా కోలాటం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, మార్చి3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం, రాత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. అశేష జనవాహిని మధ్య కోలాటం పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాలను విచ్చేసిన 11 కోలాట బృందాలు సంప్రదాయ వస్త్రధారణలో రంగు రంగుల దుస్తులతో, కర్రల తాళాలకు అనుగుణంగా సమన్వయంతో నృత్యాలు ప్రదర్శించాయి. గ్రామీణ సాంస్కృతిక సంపదను ప్రతిబింబించే ఈ కోలాట ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధలను చేశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై నృత్యాలను తిలకించారు. ప్రతి బృందం తమ ప్రత్యేక శైలిలో, భక్తి గీతాలకు అనుసంధానంగా కోలాటం వేస్తూ స్వామి వారి మహిమను చాటింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు పాల్గొనడం విశేషం. నృత్యాల మధ్య ఉత్సాహభరితమైన హర్షధ్వానాలు వినిపించాయి. ఉమ్మడి జిల్లా స్థాయి కోలాటం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి అంజిమాస్టర్ బిజినపల్లి మండలం నందివడ్డెమాన్ టీం అందుకోగా, అట్టి టీంకు మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన కదారి రవీందర్ రూ.30 వేలు అందజేశారు. రెండో విజేతగా విరేష్ సదగోడు టీం నిలిచారు. అ టీంవారికి పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొత్త మధు సూదన్‌రావు రూ.20వేలు అందజేశారు. మూడవ విజేతగా లింగాల మండలం అంబట్ పల్లి గ్రామం చెందిన శివారెడ్డి టీం కైవాసం చేసుకోగా అట్టి టీం సభ్యులకు మామిళ్ళ పల్లి గ్రామానికి చెందిన చలమల పరమేష్‌గౌడ్ రూ.15 వేలునగదు ప్రోత్సాహం అందజేశారు. నాలుగో విజేతగా యాపట్ల గ్రామానికి చెందిన శశి మాస్టర్ టీం కైవసం చేసుకుంది. అటీంసభ్యులకు మామిళ్ళపల్లి ఉపసర్పంచ్ పానం సైదులు రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, గ్రామ సర్పంచ్ మోకురాల మోహన్ గౌడ్, స్థానిక ఎస్సై వెంకట్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు కట్టఅనంతరెడ్డి, దాసర్లపల్లి గ్రామానికి చెందిన గంగుల నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాల్వ గోవర్ధన్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు గణేష్‌గౌడ్, బుధకం శ్రీనివాస్‌గౌడ్, ఎలుక స్వరూప తదితరులుపాల్గొన్నారు. నేడు వేకువజామున రథోత్సవం (తేరు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఇట నర్సింహులు తెలిపారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

## ఉప్పరపల్లిలో ఘనంగా శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**ఉప్పునుంతల, మార్చి3 ప్రభాతవార్త:** మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి దంపతుల సహకారంతో వేదమంత్రాల మధ్య కళ్యాణోత్సవం జరిగింది. భారీ ఎత్తున గ్రామస్తులు భక్తులు, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి, సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రేసోజు శ్రీనివాసా చారి, వార్డు సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మంగళవారం వేకువజామున భారీగా విశేష జనం మధ్యలో అంగరంగ వైభవంగా ఘనంగా రథోత్సవం ( తేరు) కార్యక్రమం జరిగింది.



# సొంత నిధులతో వీధి దీపాల ఏర్పాటు

### 57వ డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్ ఉదారత

**మహబూబ్‌నగర్ మార్చి 3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సి పల్ కార్పొరేషన్ 57 వ డివిజన్ పరిధిలోని పాల్సాబ్ గుట్ట , సుభాష్‌నగర్, మిత్ర కాలనీ, థియేటర్ లైన్, రాజేంద్రనగర్ ప్రాంతాలలోగత కొంత కాలంగా వెలగని వీధి దీపాలను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. వీధి లైట్ల ఏర్పాటు సంబంధించి మున్సిపాలిటీలో అందుబాటులో లేని మెటీరియల్ ను కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్ సొంతంగాఆర్థిక సహకారం అందించి వీధి దీపాలను అమర్చారు. 57వ డివిజన్ పరిధిలోని ప్రమాద పరిస్థితుల్లో ఉన్న స్తంభాలను, ఇనుప స్తంభాలను ఇప్పటికే కొన్ని తొలగించి కొత్తవి వేయించా మని, ఇంకా మిగిలి ఉన్న వాటిని తమ దృష్టికి వచ్చిన వాటి స్థానంలో కొత్తగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ మేరకు విద్యుత్ ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని సమస్యలను ప్రాధాన్యతక్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు అనంతరెడ్డి, అఖిల సీతారామశాస్త్రి లయన్ అశ్వినిచంద్రశేఖర్ ఆడమ్స్, దశరథ్ నాయక్, కృష్ణయ్య రవికుమార్, శ్రీకాంత్, రాజు, కశవుల పర్యవేక్షణలో వీధి దీపాల ఏర్పాటు చేశారు.


వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# కాంట్రిబ్యూషన్‌తో కాల్వలు

◆ శ్రమదానంతో డ్రైనేజీలు నిర్మించుకున్న భూత్పూర్ 8వ వార్డు బీసీ కాలనీవాసులు
◆ మున్సిపాలిటీ నూతన పాలకవర్గానికి కించిత్తు ఆలోచనరేకెత్తించిన వైనం


డ్రైనేజీ కాల్వలు, పైపులను శ్రమదానంతో పూడుస్తున్న కాలనీవాసులు

**భూత్పూర్, మార్చి3, ప్రభాతవార్త:** ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ వీధి(వార్డు)సమస్యను స్వయంగా తామే పరిష్కరించుకుని మున్సిపాలిటీ నూతన పాలకవర్గానికి ఓ సవాల్‌గా కాలనీవాసులు కాంట్రిబ్యూషన్ చేసుకుని స్వయం కృషితో డ్రైనేజీ కాల్వలు నిర్మించుకున్న భూత్పూర్ మున్సిపాలిటీ తొమ్మిదోవార్డు బీసీ కాలనీవాసులు మున్సిపాలిటీలో మిగిలిన అన్ని వార్డులకు ఆదర్శంగా నిలిచారు. మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు బీసీకాలనీ సరైన సౌకర్యాల్లేక పట్టణానికి దూరంగా వెలివేసినట్టుగా ఉందని కాలనీవాసులు పలువురు ఆరోపిస్తున్నారు. బీసీకాలనీలో బీటీ రోడ్లు కానీ, మురుగుకాల్వలు(డ్రైనేజీలు) పూర్తి స్థాయిలో నిర్మాణం కాలేదు. సరైన డ్రైనేజీ కాల్వల నిర్మాణాలు చేపట్టకపోవడంతో వార్డులోని కొన్ని ఇళ్ల ముందర మురుగు నీరు రోడ్లపై, ఇళ్లముందర నిలిచి తాము మలేరియా, డెంగ్యు వంటి భయంకర రోగాల బారిన పడుతున్నామని ఆవేదనను వ్యక్తం చేస్తూకాలనీవాసులు నాలుగైదుగురు ఇళ్ల యజమానులు ముందుకు వచ్చి ఇంటింటికి కొంత సొమ్మును ప్రోగుచేసుకుని (కంట్రిబ్యూషన్) జేసీబీని అద్దెకు తెచ్చుకుని కాల్వలు తవ్వించి, కాల్వల్లో డ్రైనేజీ పైపులను భిగించి తమ వార్డులో మురుగునీరు ఇళ్ల ముందర నిల్వ ఉండకుండా శ్రమదానంతో కాల్వలను పూడ్చి తమ సమస్యను తామే పరిష్కరించుకున్నారు. వార్డులో ప్రధాన సమస్యలైన డ్రైనేజీల నిర్మాణాలు, బీటీ రోడ్ల నిర్మాణాలపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని విసిగి, వేసారిన బీసీ కాలనీవాసులు తమ సమస్యలు తామే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు. డ్రైనేజీ కాల్వల నిర్మాణాలకు నడుం భిగించారు. వీరి స్వయం కృషి, స్వయంసేవ, శ్రమదానాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

## పేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేతా సత్యయాదవ్‌కు ఘన సన్మానం

**నారాయణపేట, మార్చి 3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేతా సత్య యాదవ్ ను ఊట్కూర్ మండల బీజేపీ శ్రేణులు మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. భాస్కర్, రాష్ట్ర దళిత మోర్చా అధికార ప్రతినిధి విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు చైర్‌పర్సన్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా శ్వేతా సత్య యాదవ్ మాట్లాడుతూ నారాయణపేట మున్సిపాలిటీ ప్రజలు తనకు పట్టం కట్టి బాధ్యతలు అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు కేంద్రప్రభుత్వ ఎంపీ నిధులను తీసుకువచ్చి పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు ప్రధానమంత్రి నరేంద్రమోడీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటూ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఆమె హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఊట్కూర్ ఉప సర్పంచ్ రమేష్, జిల్లా వాణిజ్య కన్వీనర్ కృష్ణయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ హన్మంతు, జిల్లాదళిత మోర్చా ప్రధాన కార్యదర్శి కొండన్ గోపాల్, మాజీ మండల అధ్యక్షుడు రమేష్, వార్డు సభ్యుడు అశోక్ గౌడ్, నాయకులు గొల్లశ్రీకాంత్, బాలాంజనేయులు, రోషనప్ప, రాజారెడ్డి, మహేష్, రారాకృష్ణ, అనిల్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## స్నేహం, ఐక్యత, సామరస్యానికి ప్రతీక హోలీ

### కర్నే రామ్ చందర్ విభాగ్ ప్రముఖ్



**మహబూబ్‌నగర్ మార్చి 3 ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)-పాలమూరు యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు . విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగుల పండుగను ఆనందంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విభాగ్ ప్రముఖ్ కర్నే రామ్ చందర్ మాట్లాడుతూ ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడుపుతారు. చెడు పై మంచి విజయం సాధించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఈ హోలీ ని జరుపుకుంటారు. ఈ పండుగ వసంత ఋతువు ప్రారంభాన్ని సూచిస్తుంది. హోలీ పండుగ స్నేహం, ఐక్యత, సామరస్యానికి ప్రతీక అనితెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ కృష్ణకుమార్, యూనివర్సిటీ అధ్యక్షులు, కార్యదర్శులు రవితేజ, రవి కిషోర్, గోపాల్, హరికృష్ణ, యువ, శివ, సంగీత, సింధుజ, అంబిక, భరత్, వినయ్, భాస్కర్ విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు 40 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు

**ఉప్పునుంతల, మార్చి3 ప్రభాతవార్త:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది తరగతి విద్యార్థులకు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వార్షిక పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది. ఉత్తమ ఫలితాల లక్ష్యంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో 40 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ప్రతిరోజూ సబ్జెక్టుల వారీగా పునర్విమర్శ, బలహీన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, మానిటరింగ్ వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. మార్చి 7 నుంచి ప్రారంభమయ్యే ప్రీఫైనల్ పరీక్షలు విద్యార్థులకు తుది సన్నాహకానికి దోహదపడనున్నాయి. ఈ పరీక్షల ద్వారా తమ స్థాయిని అంచనా వేసుకుని లోపాలను సరిదిద్దుకునే అవకాశం లభించనుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులుసబ్జెక్టుల వారీగాసందేహాలను నివృత్తి చేస్తున్నారు. గణితం, సైన్స్, ఇంగ్లీష్ వంటి కీలక విషయాల్లో అదనపు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసం పెంచేందుకు మోడల్ పేపర్లు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకతరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం తేలికపాటి తినుబండారాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా నిపుణులచే ప్రేరణాత్మక తరగతులు నిర్వహిస్తున్నారు. పట్టుదలతో చదివితే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తుండగా, తల్లిదండ్రులు పిల్లలకు మానసిక ధైర్యం అందిస్తూ సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

## పరమేశ్వర స్వామి చెరువుపై తీగల వంతెన ఏర్పాటుకు రూపకల్పన




**ఆత్మకూర్ మార్చి3 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణ సమీపంలోని పరమేశ్వర స్వామి దేవాలయానికి పరమేశ్వర స్వామి చెరువునుండి దేవాలయం వరకు తీగల వంతెన ఏర్పాటు చేసేందుకు రూపకల్పన తయారు చేసినట్లుగా ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌రహమతుల్లా మున్సిపల్ చైర్మన్ నాగమణి వైస్ చైర్పర్సన్ నల్లగొండశ్రీనివాసులు తదితరులు ప్రభాతవార్తకు తెలిపారు. పరమేశ్వర స్వామి జాతర సమయంలో భక్తులు స్వామిని దర్శించి ముక్కలుతీర్చుకునేందుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి చెరువు కట్ట బిటి రోడ్డు నుండి దేవాలయం వరకు కోటిరూపాయలకు పైబడి నిధులు వెచ్చించి తీగల వంతెన ఏర్పాటు చేసి పరమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు చెల్లెలు తీసుకుంటు న్నట్లుగా వారు తెలిపారు. అందులో భాగంగానే గత వారం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులను ఆత్మకూరుకు పంపించి తీగల వంతెన ఏర్పాటు కోసం ప్రత్యేకంగా తయారు చేసిన రూప కల్పనను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి అందజేసినట్లుగా వారు తెలిపారు. త్వరలోనే పరమేశ్వర స్వామి చెరువు కట్ట నుండి దేవాలయం వరకు తీగల వంతెన ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించనున్నట్లుగా వారు ప్రభాతవార్తకు తెలిపారు.

## పదో తరగతి ఇంటర్నల్ మార్కుల జాబితాను డీఈఓ కార్యాలయంలో అందజేయాలి

**ఉప్పునుంతల, మార్చి 3 ప్రభాతవార్త :** పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాను ఈ నెల 6 లోపు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఒ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పదవ తరగతి ఇంటర్నల్ మార్పుల జాబితా సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్దిష్ట మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేసి, సంబంధిత పత్రాలను మార్చి 6లోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు. వివరాల ప్రకారం ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్ ఒరిజినల్ ప్రతి పై సంబంధిత వెరిఫైయింగ్ ఆఫీసర్ మండల విద్యాధికారి సంతకం, అధికార ముద్ర తప్పని సరిగా ఉండాలని సూచించారు. అదేవిధంగా, ఆన్లైన్ లో కన్ఫర్మేషన్ చేసిన మార్కుల జాబితాను ప్రింట్ తీసుకుని, ప్రతి విద్యార్థి సంతకం చేయడం తప్పనిసరిఅని వివరించారు. ఆ జాబితాపై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల విద్యాధికారి సంతకంతో పాటు అధికార ముద్ర ఉండాలని, ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి చేసి సమర్పించిన యాజమాన్యాలు మళ్లీ సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇక మార్చి 5వ తేదీ రోజున ఆన్లైన్‌లో తిరిగి కన్ఫర్మ్ బటన్ సౌకర్యం అందుబాటులో ఉంచబడుతుందని తెలిపారు. ఇది చివరి అవకాశం కావడంతో అన్ని యాజమాన్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి, తప్పకుండా గడువులోపు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ గడువు అనంతరం ఎలాంటి తేది పొడిగింపు ఉండదని వెల్లడించారు. అందువల్లసంబంధితపాఠశాలలు నిర్లక్ష్యం చేయ కుండా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అన్ని విధి విధానాలను సమయానికి పూర్తి చేసి, పత్రాలను సమర్పించాలని విద్యాశాఖ వర్గాలు కోరుతున్నాయి.

## మాజీ ఎమ్మెల్యే ఉప్పల గోపాల్ రెడ్డికి ఘన నివాళి



**గద్వాల మార్చి3, ప్రభాతవార్త:** గద్వాల మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు ఉప్పల గోపాల్ రెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు ఘనంగా నివాళ్లు అర్పించారు. మంగళవారం గద్వాలలో రాయల్ లాడ్జ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఉప్పలగోపాల్ రెడ్డి మనవడు సిద్ధార్థ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రవి రెడ్డి. రిషిరెడ్డి అభిమానులు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు మోహన్ రావు, వైండింగ్ రాములు, కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్, నూర్ అహ్మద్, అచ్చన్న గౌడ్, జితేందర్ రెడ్డి. . భీమ్సేన్ రావు, విజయ్ మేనేజర్, రమేష్‌గౌడ్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం హమాలి నాయకులు. వర్కర్స్‌కు వారి కుటుంబ సభ్యుల మధ్య పండ్లు పలహారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు..కీర్తిశేషులు గోపాల్‌రెడ్డి 1967,1985 సంవత్సరములలో రెండు పర్యాయములు శాసనసభ్యులుగా ఎన్నికైనారని, నీతి, నిజాయితీగా పాలన సాగించిన ఉప్పల గోపాల్ రెడ్డికి ఘనమైన నివాళులు అర్పిస్తూ, ఆయన సేవలను కొనియాడారు.

## కేటీఆర్‌కు ఆహ్వాన పత్రికనందించిన టీఎంగౌడ్

**భూత్పూర్, మార్చి 3, ప్రభాతవార్త :** భూత్పూర్ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి మురళిధర్‌గౌడ్(టీఎంగౌడ్) కుమారుడు రోహిత్‌గౌడ్ వివాహం ఈ నెల 6న రాష్ట్రరాజధాని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్)కు టీఎంగౌడ్ మంగళవారం అందించి తన కుమారుడి వివాహమహోత్సవానికి రావాలని కేటీఆర్‌ను ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో టీఎంగౌడ్‌తో పాటు బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ పార్టీ సీనియర్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, పొన్నకల్ మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ సంబరాలు

హైదరాబాద్,మార్చి 3 ప్రభాతవార్త : సప్తవర్ణాల హోలీ సంబురం అంబరాన్నంటింది. వర్ణమయమై..రస రమ్యమయమైంది. మంగళవారం హోలీ వేడుకలతో భాగ్యనగరం తడిసిముద్దయింది. రంగుల తరంగం పరవళ్లుతొక్కింది. చిన్నా పెద్దా తేడా లేకుండా కలర్స్‌లో మునిగితేలారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఈ వేడుకను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించుకున్నారు.ఉస్మానియావర్సిటీ ప్రాంగణంలో హోలీ ఉత్సవాల్లో వందలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆట పాటలతో ఆకట్టుకున్నారు. సిటీలోని గల్లీలన్నీ 'రంగు' రంగ వైభవంగా హోలీ వేడుకలు నిర్వహించారు.











# శిరస్త్రాణం.. ప్రాణాధారం

**జూబ్లీహిల్స్, మార్చి 3, ప్రభాతవార్త:**



శిరస్త్రాణం వాహనదారులకు ప్రాణాధారమని జూబ్లీహిల్స్ జోన్ ఎసిపి కట్టా హరిప్రసాద్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో మం గళవారం ఆయన యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సహకా రంతో శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి శిరస్త్రాణాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీదైన వాహనాలు కొనుగోలు చేస్తున్న వాహనదారులు శిరస్త్రాణం ధరించకుండా ప్రయాణిస్తున్నారు. చాలా మేర రోడ్డు ప్రమాద సంఘటనల్లో శిరస్త్రాణాలు ధరించకపోవడం వల్లనే ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడటం జరుగుతుందన్నారు. ఈ కారణంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణాలు ధరించాలని, తద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చున్నారు. మరోవైపు డ్రైవింగ్ లైసెన్సులపై సైతం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా లైసెన్స్, సరైన పత్రాలు లేని వాహనదారులను గు ర్తించి కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహి ల్స్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కోరణి సునీల్, ఎస్సైలు నర్సింహారావు, గోపి, నరేందర్ తది తరులు పాల్గొన్నారు. దాదాపు 50 మందికిపైగా ఇక్కడ శి రస్త్రాణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పూర్ణిమా సరాఫ్, రాహుల్ శ్యాంశుక్లా, ఆకాశ్ తపాడియా తదితరులు పాల్గొన్నారు.

# పండగ రోజు విషాదం

**-సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల దుర్మరణం**

**-విశ్వకర్మ కాలనీలో ఘటన**



**జీడిమెట్ల, మార్చి 3, ప్రభాతవార్త**

హోలీ పండుగ రోజు తమ స్నేహితులతో కలిసి సరదాగా స్థానికంగా ఉన్న చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు నీట మునిగి మరణించిన విషాద సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం విశ్వకర్మ కాలనీకి చెందిన సాగర్ (17), కృష్ణానగర్‌కు చెందిన అభిషేక్ (17) వీరిద్దరూ హోలీ పండుగ సందర్భంగా తన స్నేహితులతో కలిసి స్థానికంగా ఉన్న పంతులు చెరువులో ఈతకు వెళ్లారు. సరదాగా చెరువులోకి దిగడంతో నీటిలోతు తెలియక ఇద్దరు యువకులు నీట మునిగారు. మరో ముగ్గురు స్నేహితులు ఒడ్డుకు చేరుకున్నారు. చెరువులో మునిగి మృతి చెందిన యువకులను డిఆర్ఎఫ్ బృందాల సహకారంతో బయటకు తీశా రు. మృతదేహాలు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సూరారం సిఐ సుధీర్ కృష్ణ తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు సిక్కుల ఊరేగింపు..ట్రాఫిక్ మళ్లింపు

**హైదరాబాద్, మార్చి 3 ప్రభాతవార్త**

హోలీ మొహల్లా, సిక్కుల మతపరమైన ఊరే గింపును పురస్కరించుకుని నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉండనున్నాయి. ఈ ఊరేగింపు బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సెంట్రల్ గురుద్వారా నుండి ప్రారం భమై శంకర్‌షేర్ హోటల్,మెహబూబ్‌గంజ్, ఎస్.ఎ.బజార్ మసీదు,బర్తన్ బజార్, స్వస్తి మిర్చి, బేగంబజార్ ఛత్రి, చూడీ బజార్, రాణి అవంతి బాయి విగ్రహం, టక్కర్‌వాడి టిజంక్షన్, గాంధీ విగ్రహం,పురానాపూల్ ఎక్స్ రోడ్, పురా నాపూల్ దర్వాజా మీదుగా కిషన్ బాగ్ గురు ద్వారా,అత్తాపూర్ లోని బరంబాలా గురుద్వారా వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో, పైన పేర్కొన్న జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకా శం ఉన్నందున మధ్యాహ్నం 3:30 గంటల నుండి రాత్రి 10:30 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయి.

**ప్రత్యామ్నాయ మార్గాలు...ట్రాఫిక్ మళ్లింపులు...**

అఫ్జల్‌గంజ్ నుండి ఎం.జె.మార్కెట్ వైపు వెళ్లే వాహనాలను అఫ్జల్‌గంజ్ టిజంక్షన్ వద్ద సెంట్రల్ లైబ్రరీ వైపు మళ్లించబడింది. ఊరేగిం పు ఎస్.ఎ.బజార్ మసీదును దాటుతున్న సమ యంలో, ఎం.జె. మార్కెట్ నుండి అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లే వాహనాలను ఎం.జె.మార్కెట్ వద్ద మలకుంట, అలాస్కా,ఛత్రి,ఎం.జె. బ్రిడ్జ్ వైపు మళ్లించడమైనది. ఊరేగింపు ఛత్రిని దాటుతున్న సమయంలో, ఎం.జె. బ్రిడ్జ్ నుండి ఛత్రి వైపు వెళ్లే వాహనాలను ఎం.జె. బ్రిడ్జ్ వద్ద జుమ్మేరాత్ బజార్,డెంటల్ కాలేజీ వైపు మళ్లించడమైనది. 100 ఫీట్ల రోడ్డు, జియాగూడ,కార్వాన్ నుండి పురానాపూల్ దర్వాజా వైపు వచ్చే వాహనాలను పురానాపూల్ ఎక్స్ రోడ్ వద్ద జుమ్మేరాత్ బజార్ ,ఎం.జె. బ్రిడ్జ్ వైపు మళ్లించడమైనది. గాంధీ విగ్రహం నుండి పురానాపూల్ దర్వాజా వైపు వచ్చే వాహనాలను పురానాపూల్ ఎక్స్ రోడ్ వద్ద 100 ఫీట్ల రోడ్డు వైపు మళ్లించడమైనది. ప్ర యాణికులు తాజా ట్రాఫిక్ అప్‌డేట్స్ కోసం మా సోషల్ మీడియా వేదికలైన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్ పేజీ మరియు ట్విట్టర్ ఫాలో అవ్వాలని పోలీరులు కోరారు.అత్యవసర ప్రయా ణ సహాయం కోసం మా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కు కాల్ చేయవచ్చుని, నగర పౌరులందరూ పైన పేర్కొన్న ట్రాఫిక్ రద్దీ మరియు మళ్లింపులను గమనించి, తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.



మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

# మియాపూర్‌లో ఉరివేసుకుని నర్స్ ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, మార్చి 3 ప్రభాతవార్త**



మృతురాలు సోనుబాయ్ (ఫైల్‌ఫోటో)

నగర శివార్లలోని మియాపూర్ పోలీస్‌స్టే షన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచే స్తున్న యువతి ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడింది. సంఘటనకు సంబంధిం చి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా నారాయణ ఖేడ్‌కు చెందిన సోనుబాయ్ మియాపూర్‌లోని ఓ హస్టల్ ఉంటూ స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో న ర్సుగా పనిచేస్తుంది. ఈ క్రమంలోనే గత ఏడాదిగా కాలంలో ఒక యువకుడితో ప్రేమలో ఉన్న ఆమె అకస్మాత్తుగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని సీలింగ్‌కు ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. మియాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో నర్సు గా పనిచేస్తున్న క్రమంలో ఓ యువకుడితో ప్రేమలో పడిన మేఘా వత్ సోను బాయ్ (20) తన ప్రేమ విఫలంకావడంతోనే ఆత్మహత్య కు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఆమె సోదరుడు ఫిర్యాదు మేరకు సంఘటనాస ్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భర్తతో విభేదాలు..

# గచ్చిబౌలిలో వివాహిత ఆత్మహత్య

**గచ్చిబౌలి, మార్చి 3 ప్రభాతవార్త**



మ ృతురాలు గంగ(ఫైల్‌ఫోటో)

భార్య,భర్తల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా కొన్ని నెలలుగా పుట్టింటిలో ఉంటున్న ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరా లు పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రం ఈస్ట్‌గోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన నీలం వీరబాబు తన కుటుంబంతో కలిసి గత సంవత్స ర కాలంగా గచ్చిబౌలి టిఎన్ జీఓ కాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరబాబు స్థానికంగా వాచ్ మెన్‌గా పనిచేస్తుండగా, వీరి కుమార్తె గంట గంగ(28)ను 2018లో పెద్దాపురంకి చెందిన సుబ్రమణ్యంకు ఇచ్చి వివాహం చేశాడు. కాగా వీరికి సంతానం కలుగకపోవడం, భార్య,భర్తల మధ్య విభేదాలతో గంగ గత 5నెలలుగా టిఎన్‌జిఓ కాలనీలో గల తండ్రి వీరబాబు ఇంట్లోనే ఉంటుంది. కాగా ఈనెల 1వ తేదీన కుటుంబ సభ్యులు వారి పనుల్లో ఉండగా, గంగ బాత్‌రూమ్‌కు వెళ్లి బొద్దింకలు చంపేం దుకు ఉపయోగించే పురుగుల మందు తాగింది. బయటకు వచ్చి వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గంగను వెంటనే కొండాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మ ృతిచెందింది. ఈమేరకు మ ృ తురాలి తండ్రి వీరబాబు ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసు కున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అంతా నకిలీ..

**-టీ పొడి, సర్ఫ్ పొడర్, గుడ్‌నైట్ రీఫిల్స్**

**-గుజరాత్ నుంచి తెచ్చి హైదరాబాద్‌లో అమ్మకం**

**-ముగ్గురు రాజస్థానీ వ్యక్తులను అరెస్ట్ చేసిన సిసిఎస్ పోలీసులు**



పోలీసులు స్వాధీనం చేస్తుకున్న నలిలీ టీపొడర్, సర్ఫ్‌ప్యాకెట్లు

**హైదరాబాద్, మార్చి 3,,ప్రభాతవార్త:**

మార్కెట్ అంతా నకిలీ మయంగా మారిపోయింది. బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ వస్తువుల తయారీకి అడ్డు అదుపులేకుండా పోతుంది. ఈనేపథ్యంలో ఇలాం టి నకిలీగాళ్లను గుర్తించేందుకు హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో నకిలీ టీపొడి, సర్ఫ్‌పౌడర్, గుడ్‌నైట్ రీఫిల్ విక్రయిస్తు న్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. రాజస్థాన్ అజ్మీర్ జిల్లాకు చెందిన జయ రామ్ (30) నాగౌర్ జిల్లాకు చెందిన కచ్చవా సురేందర్ (34), బార్మార్ జిల్లాకు హను మాన్ రామ్ (21) దగ్గరనుండి 1340 రెడ్ లేబుల్ ప్యాకెట్లు , 100 తాజ్ మహ ల్ ప్యాకెట్లు , 75 కిలోల లూజ్ టీ పొడర్, 950 నకిలీ టైడ్ ప్యాకెట్లు, 100 నకిలీ ఏరియల్ ప్యాకెట్లు, 300 వీల్ ప్యాకెట్లు, 550 సర్ఫ్ ఎక్సెల్ ప్యాకెట్లు. మస్కిటో రీఫిల్స్ గుడ్‌నైట్ ల్విడ్ 3600 బాటిళ్లు (45 మి.లీ) లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గుజరాత్‌లోని డీలర్ల నుండి తక్కువ నాణ్యత గల మెటీరియల్‌తో పాటు నకిలీ ప్యాకింగ్ కవర్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని అసలైన బ్రాండెడ్ వస్తువులుగా నమ్మించి గోషామహల్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్ ,ఇతర ప్రాంతాల్లోని స్థానిక రిటైల్ హోల్‌సేల్ వ్యాపారులకు విక్ర యిస్తూ ప్రజలను మోసగిస్తున్నటున గుర్తించారు. ఈసందర్భంగా నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని వస్తు వుపై ఉన్న కోడ్‌లను తనిఖీ చేయడం ద్వారా అవి అసలైనవో కాదో ధృవీకరించుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

# అటు ఎండలు... ఇటు జ్వరాలు



**-ఉష్ణోగ్రతలతో పాటే పెరుగుతున్న వైరల్ ఫీవర్స్**

**-తలనొప్పి, కండరాల నొప్పి ..నాలుకతడి ఆరిపోవడం**

**-డయేరియా,వాంతులు లక్షణాలతో బాట**

**-ప్రభుత్వ ,ప్రైవేట్ ఆసుపత్రులల్లో పెరుగుతున్న బాధితులు**

**-బయట తిరిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు**



**హైదరాబాద్, మార్చి 3,ప్రభాతవార్త:**

ఎండలు ప్రజల్ని అల్లాడిస్తున్నాయి. ఉన్నట్లుండి ఉ ష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఎటు చూసినా వైరల్ జ్వరాల బాధితులు కనిపిస్తున్నారు. వాంతులు, విరే చనాలు, ఒళ్లనొప్పుల వంటి లక్షణాలతో సతమత మవుతున్నారు. ఒక్కో క్లినికల్ వద్ద 50మందికి పైగా జ్వరపీడితులు ఉంటున్నట్లు తెలుపుతున్నారు. ఫీవర్ ఆస్పత్రికి కూడా కొద్దిరోజులుగా ఔట్ పేషెం ట్ (ఓపి) కూడా పెరుగుతుంది. కార్పొరేట్ ,ప్రైవేట్ ఆస్పత్రులల్లో ఒకేసారి కనీసం అయిదారుగురు బాదితుల్ని చూస్తున్నామని చెబుతున్నారు. కండరా లు పట్టేయడం, సొమ్మసిల్లడం, నీరసించిపోవడం, చెమటలు పట్టడం, నాలుకతడి ఆరిపోవడం, వాం తులు, వీరేచనాలు కళ్లతిరగడం ,తలనొప్పి తదిత ర లక్షణాలు వీరిలో ప్రధానంగా కనిపిస్తుంన్నాయని చెబుతున్నారు. ఎండలో ఎక్కువగా తిరిగేవారు ము ఖ్యంగా ద్విచక్రవాహనాలపై తిరిగేవారు జ్వరాల బా రినపడే ముప్పు ఉందని వారు వివరించారు. అ లాగే పరిశుభ్రమైన నీరు తాగకపోతే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే అనేది వైద్యుల మాట. ప్రధానం గా హోటళ్లు, చాట్ దుకాణాలు, బస్సు స్టేషన్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద ఏనీరు పడితే ఆఆనీరు తాగడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆహారం వి షయంలోనూ ఆరోగ్యకరమైన పదార్థాల్ని మాత్రమే తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

**ఇలా చేయండి ..**

ఎక్కువగా ఇంట్లో తయారు చేసే పండ్ల రసాలు తీసుకోవాలి. నీరు గ్లూకోజ్ ,జావ ,బార్లీ ,మజ్జిగ, రాగి అంబలి, సగ్గుబియ్యంతో చేసిన పానియాలు తీసుకోవడం మంచిది. నీటి శాతం కోల్పోతున్న వారు తాగే నీరులో ఉప్పు, పంచదార వేసుకని తాగాలి. ఉదయం 8గంటలకే బయటకు వెళ్లాలి. సాయంత్రం 6గంటల తర్వాత బయటి పనులు పూర్తి చేసుకోవాలి. ఎండల్లో తిరిగేవారు తప్పనిసరి గా గొడుగులు, టోపీలు ధరించాలి. వాంతులు ,విరేచనాలు అవుతున్నప్పటికీ ఎక్కువగా నీరు తాగి స్తూనే ఉండాలి. రోడ్లపక్కన విక్రయించే ఆహారం తినకూడదు. అపరిశుబ్రమైన నీరు తాగకపోవడం మంచింది. మాంసం, గుడ్లు , నూనె పదార్థాల జోలికి వెళ్లకూడదు. వేడిగా, తాజాగా ఉండే ఆహారం తీసుకోవాలి.

**అప్రమత్తంగా ఉండాలి..**

ప్రధానంగా ఎండ వేడిమి, కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధులు వస్తాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులు రా కుండా చూసుకోవచ్చు. నివారణకు వైద్యులు సహాల ను పాటించాలి. వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గ కుండా జాగ్రత్తపడాలి. రోడ్ల పక్కన లభించే అపరి శుభ్ర ఆహార పదార్థాలను తినొద్దు. జలుబు ,తు మ్ము లు , ఒళ్లనొప్పులతో మొదలయ్యే జ్వరం,. నా లుగై దు రోజులపాటు ఇబ్బంది పెడుతుంది. మరీ ఎక్కువ గా ఉంటే వైద్యులని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

# చంద్రగ్రహణంతో దేవాలయాలు, షాపులు మూసివేత



చంద్ర గ్రహణం సందర్బంగా మూసి వేసిన చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం



చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేసిన గుల్జారాహౌస్‌లోని బంగారం దుకాణాలు

**చార్మినార్,మార్చి 3 ప్రభాతవార్త :**

చంద్ర గ్రహణం సందర్భంగా మంగళవారం పాత బస్తీలోని దేవాలయాలనుమూసి వేశారు.చంద్ర గ్రహణం ఏర్పడటంతో చార్మినార్,పటేల్ మార్కెట్, ఉర్దూగల్లీ,కోకరివాడి,షక్కర్‌కోట,ఘాన్సీ బజార్,బండి అడ్డ,చార్‌కమాన్,కాలీకమాన్,శాలిబండ,బహదూర్‌ప ుర,దూద్‌బౌలితో పాటు పలు ప్రాంతాలలోని హిం దూ వ్యాపారులు తమ దుకాణాలు మూసి వేసి చంద్ర గ్రహణం నియమాలను పాటించారు. చార్మి నార్‌శ్రీ భాగ్యలక్ష్మీ,చార్మినార్ శ్రీ మహదేవ్ మంది రం,చార్‌కమాన్ శివాలయం,చార్‌కమాన్ శ్రీ బాలాజి మందిరం,పాతనగరంలోని అన్ని దేవాలయాలను చంద్ర గ్రహణం సందర్భంగా తెరవలేదు.కాగా ఘా న్సీ బజార్,చార్‌కమాన్, శాలిబండ,కోకరివాడి,షక్కర్ కోటలో ఉన్న బంగారం,వెండి ఆభవరణాలను షాపు లను మంగళవారం మధ్యాహ్నం రెండున్నర గంట లకు మూసి వేశారు.అదే విధంగా బెంగాలీలు ఎక్కు వగా ఉన్న ఘాన్సీ బజార్‌లో బంగారు ఆభరణాలు తయారు చేసే దుకాణాలు సైతం తెరవ లేదు. వస్త్రాల వ్యాపారానికి ఎంతగానో ప్రసిద్ధి గాంచిన పటేల్ మార్కెట్,రికాబ్‌గంజ్,బిజె మార్కెట్,ఆర్‌జె మార్కెట్,గోపాల మార్కెట్లలోని వందలాది వస్త్రాల షాపులు మంగళవారం ఏర్పడిన చంద్ర గ్రహణం సందర్భంగా వస్త్రాల వ్యాపారులు మూసి వేశారు. పాతబస్తీలోని వస్త్రాలు,బంగారం,వెండి షాపులు తెరవక పోవటంతో మార్కెట్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

పాతనగరంలోని ప్రజలు అత్యవసర పరిస్థితులలో మాత్రమే బయటకు వచ్చారు.ఇండ్లలో ఉండి చంద్ర గ్రహణం నియమాలు పాటించారు.